# సిపాయి పెళ్లాం

ఈ ఊరు !

ఊరు అంచునే గుడిశెలున్నాయి. గుడిశెలకు మధ్య మధ్య తాటి చెట్లున్నాయి.

ఒక గుడిశెలో రోసి ఉంది. దాని మరిదిగూడా ఉన్నాడు.

రోసి మగడు మిలిటరీలో చేరాడు.

ఆ గుడిశె పక్కనే మట్టల తాటిచెట్టు లంబాడిదయ్యం అల్లే గుడిశెను చూస్తూ నిటారుగా ఉంది.

రోసి అందంగలది. విరబోసిన జుట్టుగలదైనా అందంగలదే.

రోసి నీటుగలది. స్నానమాడని ఒళ్ళుగలదైనా నీటుగలదే.

రోసి గుట్టుకలది. చిరుగు చిరుగులమధ్య తొడలూ పిక్కలూ కనబడు తున్నా రోసి గుట్టుకలదే !

గుడిసేటిదే రోసి. కాని రోసి రోషంకలదే అని ముఖమే చెబుతుంది.

యదవ సోమాయిగాడు— దాని మరిది.

అంటయదవ సోమాయిగాడు. ఇంట ఉంటాడు పనిపాటలేక. ఊరు తిరుగుతాడు ఊరుకోలేక. తాగుతాడు తన్నేవాళ్ళు లేక. వాగుతాడు వప్పగించేవాళ్ళులేక. అప్పుచేస్తాడు అడుక్కు-తింటాడు. వాడికి తోడు ఒక కుక్క-కూడా.

అప్పుచేస్తే చేశాడు యెర్రియదవ- చేసే అప్పు కాబూలు వాడిదగ్గిరా!

కాబూలువాడు దబాయిస్తున్నాడు వాడ్ని కనబడ్డ చోటల్లా. రోసిని పీడిస్తున్నాడు వీడు. పనీపాటా చేసుకుని నాలుగు డబ్బులు కూడబెడుతుందది. అది అన్నానికి సరిపోతుంది. మిలిటరీలోంచి మొగుడు కాస్త పంపితే మరిది అప్పులకు పోతుంది. సంసారం నీరసిస్తున్నది.

ఓ రోజు దీనంగా మాట్టాడడం మొదలెట్టాడు సోమిగాడు.

"వదినా నా దుంప తెగుతోంది !"

"ఎందుకూ, మొద్దల్లే పని సెయ్యవనేనా ?"

"పటానోడు నిన్నీడకే వచ్చాడే !"

"పటానోడా ! ఈడేం పనీ ?"

"డబ్బియ్యాలగా మనం !"

"మనం! నువ్వా నేనా ?"

"నేనేలేయే ! నువ్వివ్వకపోతే నేనెట్టిత్తానే ?"

"ఎంతా ?"

"పద్దాలుగున్నర !"

"అమ్మో! జన్మంతా కూడెట్టినా అంతరాదే, మనకి. ఏం సెయ్యాల్రో బాబో ?"

"అడే సెప్పాడు యేం సెయ్యాలో లంజకొడుకు."

"ఏం సెప్పాడు ?"

"నిన్ను సూశాట్ట! నువ్వందం గలదానివంట! ఇంకేదో సెప్పాడు!"

"అయితే ?"

"పోతావా ?"

"యాడకి ?"

"యాడకుందీ !"

"యాడకంటే ?"

"నేనేం సెప్పేదే నీ సిగ్గొయ్య!"

"యేంరోయ్! యేంరోయ్! నువుసెప్పేది యిదా? నీ అన్నలేదనేనా? యేందిరా? మొగాన నెత్తురు లేదేంరా నీకు ? యేం లావుమడిసివిరా. పోతాలే!"

పోయింది పోయింది పోయింది పోయింది పఠాను కొట్టు దగ్గరకు పోయింది రోసి.

పోతుంటే రోడ్డైనా పొంగిపోయిందా !

సరాసరి పఠాను కొట్టులోపలికి పోయింది.

గడప గడ గడ లాడిందా !

పరుపుమీద హుక్కా తాగుతూ పఠానుగాడు చూచాడు. వారెవా అను కున్నాడు.

"యామందీ మా వోడు మీకు బాకంటగా?" అని అడిగింది రోసి.

"బాకీకేంలే, నువ్వొచ్చావుగా" అన్నాడు అర్థం అయ్యీ అవ్వని తెనుగులో.

"నెలకింత తీర్సుకోండని సెప్పండి, నే తీరుత్తా. అంతేగాని ఆడదాన్ని యేడిపించటం యెందుకు సామీ?"

"పరవాలేదులే! బాకీవొద్దు నాకు, నువ్వే కావాలి!"

"విన్ననే ఓ బామ్మఁడు హరికథ సెప్పాడు. కబీరంట. కోమటంట. అడిగాడంట. కోమటే కాళ్ళమీద పడ్డాడంట. కబీరు మీవోడేనంటగా?"

"మావోడూ! వాడూ వాడూ దద్దమ్మలు!"

"నువ్వు మొనగాడివా?"

"సూడు నా కండలు! సూడు నా మీసం!"

"యేందిరా సూసేది. మా వోడితో అక్కడే సెప్పా. ఆడికన్న తాడిసెట్టు మేలని. నీతో సెప్పేదీ? నీతో సెప్పేదీ?"

"ఏమిటీ?"

"మా ఆసలోడు లేడుగందా అని నువ్వేసుకుంటే, నీ తర్వాత ఆడేసుకుందాం అనిగాదూ సోమిగాడి పన్నాగం! యదవల్లారా! కారంలేని కండలు ఏం కండలురా నీయి? ఆప్పిచ్చి ఆడాళ్ళయెంట పట్టం యేం మొగసిరిరా నీది? దగ్గిరావోకు లమ్డికొడకా! సెప్పుతో కొట్టానంటే కాలికొద్దీ కాబూలు లగెత్తాలి, జాగ్రర్త." అంటూనే వాడు అందుకోకుండానే రోసి పరుగెత్తి రోడ్డుమీదికి చేరింది.

ఇంటి కెళ్ళలేదు రోసి. ఇంకో ఊరుపోయి మొగుడుకోసం ఎదురు చూస్తోంది.

ఆ వూరు!